ఎంపీ రవిచంద్రకు కేసీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా రవిచంద్ర శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు పలువురు పార్టీ నేతలు కూడా వద్దిరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మేడిగడ్డ పునరుద్ధరణ సాధ్యమే

- తేల్చిచెప్పిన ఎల్ అండ్ టీ ప్రతినిధులు
- కాళేశ్వరం కమిషన్ ఎదుట నివేదన
- బరాజ్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారం పటాపంచలు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ పనికిరాదంటూ కాంగ్రెస్ సర్కారు చేస్తున్న ప్రచారం అంతా వట్టిదేనని తేలిపోయింది. ఎన్‌డీఎస్ఏ నివేదిక సాకుతో కాలయాపన చేస్తున్నదని స్పష్టంగా రూఢీ అవుతున్నది. తాజాగా కాళేశ్వరం కమిషన్ ఎదుట బరాజ్ నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్‌టీ ప్రతినిధులు నివేదించిన అంశాలే అందుకు రుజువు. బరాజ్‌ను పునరుద్ధరించి వినియోగించుకోవచ్చని ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు వెల్లడించడంతో బరాజ్‌పై ఇప్పటివరకు కాంగ్రెస్ చేస్తున్న ప్రచారమంతా బూటకమని తేలిపోయింది. జస్టిస్ పీసీ ఘోష్ శుక్రవారం నిర్వహించిన బహిరంగ విచారణకు ఎల్‌అండ్‌టీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామకృష్ణరాజు, సంస్థ టన్నెల్స్ వైస్ ప్రెసిడెంట్, హెడ్ సురేశ్ కుమార్, సంస్థ మాజీ డీజీఎం రజనీశ్ హాన్ హాజరయ్యారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణం, నాణ్యత, బ్లాక్ 7 కుంగుబాటుపై వారిని ఘోష్ ప్రశ్నించారు. డిజైన్లు, డ్రాయింగ్‌తోపాటు భారీ వరదలతో బరాజ్ డ్యామేజీ అయిందని ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు వెల్లడించారు. వెంటనే మోడల్ స్టడీస్ మళ్లీ చేయాలని, మొదట్లోనే సమస్య పరిష్కరిస్తే ఇంతటి డ్యామేజీ అయ్యేది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కుంగుబాటుకు గల కారణాలపై తామూ అధ్యయనం చేశామని, ప్రభుత్వానికి ఆ నివేదిక ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్లాక్ 7ను పునరుద్ధించవచ్చని, బరాజ్‌ను తిరిగి వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. డిజైన్ లోపాలున్నాయని ఐఐటీ రూర్కీ స్టడీలో తేలిందని, ఆ రిపోర్టుని ఇరిగేషన్, ఎన్‌డీఎస్ఏకి పంపినట్టు తెలిపారు. ఎన్‌డీఎస్ఏ సిఫారసుల మేరకు ప్రస్తుతం తాత్కాలిక చర్యలే చేపట్టామని వివరించారు.

ఎన్‌డీఎస్ఏ నివేదికను సాకుగా చూపుతూ

లక్ష్మీ బరాజ్ (మేడిగడ్డ)లోని 7వ బ్లాక్ లోని 20వ పిల్లర్ 2023 అక్టోబర్‌లో కుంగుబాటుకు గురైన విషయం తెలిసిందే. ఇదే అదనుగా ప్రాజెక్టుపై అక్కసు వెళ్లగక్కుతున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నది. సమగ్ర విచారణ చేయకముందే డిజైన్, నాణ్యతా లోపాలపై ఆరోపణలు చేసింది. మంత్రులు ఒకసారి, ముఖ్యమంత్రి మరోసారి ప్రాజెక్టును స్వయంగా సందర్శించి అక్కడా అవే ఆరోపణలు చేశారు. అక్కడితో ఆగకుండా అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేయడంతోపాటు, ఒకవైపు విజిలెన్స్ విచారణకు, మరోవైపు జ్యూడీషియల్ ఎంక్వయిరీకి ఆదేశించింది. ప్రాజెక్టు పునరుద్ధరణ అంశాన్ని మాత్రం ఎన్‌డీఎస్ఏ దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చిన అనంతరమే ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను చేపడతామంటూ మీనమేషాలు లెక్కిస్తున్నది. ఏడాదికిపైగా గడిచినా పునరుద్ధరణపై మాత్రం వారు స్పందించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎన్‌డీఎస్ఏ నివేదికను తెప్పించుకునే ప్రయత్నమూ చేయని దుస్థితి నెలకొన్నది. అయితే ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు వెల్లడించిన అంశాల మేరకు బరాజ్ పునరుద్ధరణకు అవకాశాలున్నా కాంగ్రెస్ చొరవ చూపడం లేదని తేటతెల్లమవుతున్నది.

కుప్ప'కూలి'న రైతు బతుకు!

- కాంగ్రెస్ పాలనలో నర్సింహులు బలవన్మరణం
- పొలంలోనే పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య
- రోడ్డునపడిన కుటుంబం
- కూలిపనులు చేసుకుంటున్న భార్య, కూతురు
- కేసీఆర్ రైతుబీమా తప్ప కాంగ్రెస్ ఏమీ ఇయ్యలే

రైతు ఈర నర్సింహులు భార్య, కూతురు

ఆత్మహత్య చేసుకున్న రైతు ఈర నర్సింహులు

నిజామాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆత్మహత్య చేసుకున్న ఆ రైతు కుటుంబానికి గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతుబీమాయే ఆదెరవు అయింది. కష్టకాలంలో రూ.5 లక్షల రైతుబీమా సొమ్ము ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. అప్పులు భరించలేక తనువు చాలించిన ఆ రైతు కట్టుకున్న భార్యకు, కన్నబిడ్డలకు అదే ఆసరా అయింది. కానీ, ప్రతి అంశంలో గొప్పలకు పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆ కుటుంబాన్ని పట్టించుకోవడమే లేదు. సర్కారు నుంచి అండ దొరకక ఆ రైతు కుటుంబం ఇప్పుడు విలవిల్లాడుతున్నది. తమ పేరిట ఉన్న కొద్ది వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చిన ఆ ఇల్లాలు, పిల్లలు వ్యవసాయ కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని గడుపుతున్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన ఈర నర్సింహులు (43), పద్మ దపంతులకు ఇద్దరు కూతుళ్లు. ఆ కుటుంబానికి వ్యవసాయమే జీవనాధారం. నర్సింహులు తనకున్న మూడెకరాల భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కేసీఆర్ హయాంలో ఏనాడూ పంటలు ఎండిన దుస్థితిని చూడలేదు. దర్జాగా యాసంగిలోనూ పంటలు సాగుచేసి చేతినిండా డబ్బులు ఆర్జించాడు. కేసీఆర్ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వడంతో అప్పుచేసే ఖర్మ కూడా నర్సింహులుకు పట్టలేదు.

అప్పుల ఊబిలో కూరుకుపోయి..

2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ హయాంలో రైతుభరోసా అమలు ఇప్పటికీ మొదలవ్వనే లేదు. సాగునీటి కటకట నెలకొన్నది. దీంతో చాలా మంది అన్నదాతలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దశలో ఈర నర్సింహులు సాగు నీటి కోసం బోర్లు వేయించాడు. బోర్లు పడక, అప్పులే మిగిలాయి. 2024 మార్చి 9న తన కుటుంబానికి జీవనాధారమైన పంట పొలంలోనే నర్సింహులు చెట్టుకు ఉరేసుకొని తనువు చాలించాడు. దీంతో అతని భార్య పద్మ, ఇద్దరు కూతుళ్లు పెద్ద దిక్కును కోల్పోయారు. రేవంత్ రెడ్డి సర్కారు హయాంలోనే ఈర నర్సింహులు ఆత్మహత్య చేసుకున్నాడు.

కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్న నర్సింహులు భార్య

అప్పులబాధలు చెల్లించలేక కానరాని లోకాలకు వెళ్లిన రైతు ఈర నర్సింహులుకు భార్య పద్మ, పిల్లలు నవీన, భార్గవి ఉన్నారు. ముగ్గురు ఆడబిడ్డలు కాగా, పెద్ద కూతురు ఆత్మహత్య చేసుకొన్నది. భర్తను, పెద్ద కూతురును కోల్పోయిన పద్మ ఇప్పుడు తీవ్రమైన కష్టాల్లో మునిగిపోయింది. పిల్లలను చదివించుకుంటున్న ఆమె సర్కారు నుంచి సాయం కోసం ఎదురుచూస్తున్నది. ఈ మేరకు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు పద్మ అర్జీ పెట్టుకున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. జీవో నంబర్ 194 ప్రకారం అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ పద్మ ప్రభుత్వాన్ని కోరుతున్నది. గత జూలై 1న కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజావాణిలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు దరఖాస్తు పెట్టుకున్నది. ప్రభుత్వ సాయం కోసం బాధిత కుటుంబానికి ఎదురుచూపులే మిగిలాయి. ప్రభుత్వ సలహాదారు అయిన కామారెడ్డి సీనియర్ నేత షబ్బీర్ అలీ స్పందించి ఆదుకోవాలని ఆ బాధిత కుటుంబం వేడుకుంటున్నది.

కూలిపనులకు పోతున్నం

నా భర్త నిరుడు మార్చి 9న పొలంలోనే ఉరేసుకున్నడు. పంటకు నీళ్లు లేక అప్పులు జేసి బోర్లేసిండు. అవి కట్టలేక ప్రాణాలు తీసుకొని మమ్మల్ని ఒంటరి చేసి పోయిండు. కేసీఆర్ సారు తెచ్చిన రైతుబీమా పథకం కింద మాకు రూ.5 లక్షలు అచ్చినయ్. ఇద్దరు ఆడబిడ్డలున్నరు. పెద్ద దిక్కులేని మా కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి. ఉన్న భూమిని కౌలుకిచ్చి నేను, నా బిడ్డలం కూలిపనులకు పోతున్నం.

- పద్మ, ఆత్మహత్య చేసుకున్న రైతు ఈర నర్సింహులు భార్య

మరో రైతు ఆత్మహత్య

- దిగుబడులు లేక.. అప్పులు తీర్చలేక
- వనపర్తి జిల్లాలో అన్నదాత బలవన్మరణం

ఖాజాపాషా (ఫైల్)

పెద్దమందడి, జనవరి 24 : దిగుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వనపర్తి జిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు పెద్దమందడి మండలం చిన్నమందడి గ్రామానికి చెందిన ఖాజాపాషా (43)కు ఇద్దరు సోదరులు. మొత్తం కలిపి వీరి తల్లి పేరిట రెండెకరాల పొలం ఉన్నది. ఇందులోనే వారు పంటలు సాగుచేస్తూ కుటుంబ పోషణ కొనసాగించారు. ఎక్కువగా వరి సాగు చేసేటోళ్లు. నిరుడు వరి దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. దీంతో ప్రత్యామ్నాయంగా వ్యవసాయంతోపాటు పాడిని ఎంచుకున్నారు. ఇందుకోసం రూ.6 లక్షలు వెచ్చించి ఐదు గేదెలను కొనుగోలు చేశాడు. ఇది కూడా లాభసాటిగా లేకపోవడంతో దిగాలు చెందేవాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. గురువారం మధ్యాహ్నం తన పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇప్పటికి రాలిన మట్టిపూలు 409

టీడీఎస్ రద్దు పిల్ తిరస్కరణ

న్యూఢిల్లీ, జనవరి 24: ఆదాయపు పన్ను చట్టం కింద టీడీఎస్ విధానాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన పిల్‌ను పరిశీలించడానికి సుప్రీం కోర్టు శుక్రవారం తిరస్కరించింది. 'క్షమించండి, దీనిని మేం ఆలకించం, కావాలంటే మీరు దీనిపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించవచ్చు' అని ధర్మాసనం తెలిపింది. న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ వ్యక్తిగత హోదాలో అడ్వకేట్ అశ్వనీ దూబేతో కలిసి వేసిన పిల్‌ను విచారించిన న్యాయమూర్తులు ఈ పిల్‌లో ఐటీ నిబంధనలకు సంబంధించి కొన్ని ముఖ్యమైన అంశాలు ఉండవచ్చునని, దీనిపై హైకోర్టులో కేసు ఫైల్ దాఖలు చేయవచ్చునని సూచించింది.

ఫోన్లను బట్టి చార్జీల బాదుడు లేదు

అందరికీ ఒకే విధానం అమలు స్పష్టం చేసిన ఓలా, ఉబర్

న్యూఢిల్లీ, జనవరి 24: దూరం ఒక్కటే అయినా వేర్వేరు ఫోన్ల ద్వారా రైడ్‌లు బుక్ చేసిన వినియోగదారులకు వేర్వేరు చార్జీలు విధిస్తున్నారని, ముఖ్యంగా ఐఫోన్ యూజర్లపై బాదుడు అధికంగా ఉందని వచ్చిన ఆరోపణలపై క్యాబ్ సేవల సంస్థలు ఉబర్, ఓలా శుక్రవారం స్పందించాయి. వినియోగదారులు వాడే ఫోన్లను బట్టి తాము చార్జీలను నిర్ణయించడం లేదని స్పష్టం చేశాయి. గమ్యస్థానం ఒకటే అయినప్పటికీ అది ఐఓఎస్ (ఐఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్) నుంచి బుక్ చేసిన వారికి ఒక రేటు, ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి రైడ్ బుక్ చేసిన వారికి మరో చార్జీ వసూలు చేస్తున్నారని ఈ ప్రయాణ సేవల సంస్థలపై ఆరోపణలు వచ్చాయి. ఈ స్పష్టమైన ధర వ్యత్యాసాన్ని ప్రశ్నిస్తూ వాటి ధర నిర్ణయం విధానాలను వివరించాలని, చార్జీల తేడా సమస్యను పరిష్కరించాలని కేంద్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) వీటికి నోటీసులు జారీ చేసింది. దీనిపై ఓలా అధికార ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ 'మేము కస్టమర్లకు చార్జీల నిర్ణయంలో ఏకీకృత విధానాన్ని అవలంబిస్తున్నాం. వారు వాడే సెల్‌ఫోన్లను బట్టి చార్జీలలో తేడా లేదు. అందరికీ ఒకే విధమైన చార్జీల విధానం అమలు చేస్తున్నాం' అని తెలిపారు. ఇదే విషయాన్ని తాము ఈ రోజు సీసీపీఏకు తెలియజేశామని, ఈ విషయంలో ఏర్పడిన అపోహలను తొలగించడానికి సీసీపీఏతో కలిసి పనిచేస్తామని ఆయన చెప్పారు. కాగా, దీనిపై వివరణ ఇవ్వాలని రాయిటర్స్ సంస్థ కోరగా, యాపిల్, గూగుల్ సంస్థలు ఇంకా స్పందించ లేదు.

కేసీఆర్ సోదరి కన్నుమూత

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సోదరి చీటి సకలమ్మ (82) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆమె.. శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కేసీఆర్‌కు సకలమ్మ 5వ సోదరి. ఆమె స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర. భర్త హన్మంతరావు కొన్నేండ్ల క్రితమే మృతి చెందారు. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. సకలమ్మ మరణవార్త తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్‌రావు హుటాహుటిన వైద్యశాలకు తరలి వెళ్లారు. ఆమె అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు సమాచారం.

నేటి బీఆర్ఎస్ సమావేశం వాయిదా

హైదరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతోపాటు ఇతర ముఖ్య నాయకులతో శనివారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించ తలపెట్టిన సమావేశం వాయిదా పడింది. కేసీఆర్ సోదరి సకలమ్మ మృతి నేపథ్యంలో ఈ సమావేశం వాయిదా పడినట్టు బీఆర్ఎస్ వర్గాలు వర్గాలు వెల్లడించాయి.

సినీ ప్రముఖులపై ముగిసిన ఐటీ దాడులు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): సినీప్రముఖుల ఇండ్లు, కార్యాలయాలలో ఆదాయపన్నుశాఖ అధికారులు 4 రోజుల పాటు జరిపిన దాడులు శుక్రవారం ముగిశాయి. దిల్ రాజు ఇంట్లో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. దిల్ రాజు కుమార్తె హన్సితా రెడ్డి, సోదరులు, బంధువులు, ఫైనాన్స్ ఇస్తున్న వ్యక్తుల ఇండ్లు, కార్యాలయాల్లోనూ అధికారులు సోదాలు చేశారు. నిర్మాతలు నవీన్, రవిశంకర్, డైరెక్టర్ సుకుమార్, మైత్రీ సీఈవో చెర్రీ, మ్యాంగో మీడియా ప్రతినిధి రామ్ సహా మొత్తం 18చోట్ల 55 మంది అధికారులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. పలు డాక్యుమెంట్లు, హార్డ్‌డిస్క్‌లు, ఆడిట్ రిపోర్టులను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తున్నది.

3558 కేజీల గంజాయి కాల్చివేత

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో 303 కేసుల్లో పట్టుబడిన 3,558 కేజీల డ్రగ్స్‌ను కాల్చివేసినట్టు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కాల్చివేసిన డ్రగ్స్, గంజాయి విలువ రూ. 14.60కోట్లుగా ఉంటుందని పేర్కొన్నారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో 10,596 కేజీల గంజాయి నిల్వలున్నాయని వెల్లడించారు. ఈ మొత్తాన్ని జనవరిలోపు డిస్పోజల్ చేయడానికి కసరత్తు చేపట్టినట్టు పేర్కొన్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు